క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ తీగల మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా బందరు రోడ్డు, సనత్‌నగర్, సిద్ధిఖ్‌నగర్, తులసీనగర్, వరలక్ష్మీపురం, మహదేవపురం కాలనీ, పంటకాలువ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

దంతాల సంరక్షణతో మెరుగైన ఆరోగ్యం



కంకిపాడు: దంతాల సంరక్షణతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని దంత వైద్య నిపుణులు డాక్టర్ వణుకూరు ప్రవీణ్ అన్నారు. గోసాల జె.డి. డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో రొయ్యూరులో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 90 మంది రోగులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ పంటి సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్ అనూష, డాక్టర్ సీహెచ్ హదస్సా పాల్గొని వైద్య సేవలు అందించారు.

క్రమశిక్షణ లేకపోతే కఠిన చర్యలు



పెనమలూరు: రౌడీషీటర్లు క్రమశిక్షణతో ఉండాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐలు రాజేష్, ఉషారాణి హెచ్చరించారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐలు మాట్లాడుతూ గతంలో కేసులున్న వారిపై రౌడీషీట్లు తెరిచామన్నారు. క్రమశిక్షణతో ఉంటే కేసులు కొట్టి వేసి రౌడీషీట్లు తొలగిస్తామని చెప్పారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు రాని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అవసరమైతే నగర బహిష్కరణ కూడా చేస్తామన్నారు. ప్రతీ రౌడీషీటర్‌పై నిఘా ఏర్పాటు చేశామన్నారు. వారు ఊర్లు వెళితే ముందుగా పోలీసులకు సమాచారం చెప్పాలని ఆదేశించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఉయ్యూరు: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు కోరారు. స్థానిక మానికొండ భవన్‌లో యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు, ప్రభాకర్‌రావు, హుస్సేన్, ఝాన్సీ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన'

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ఇన్‌చార్జి ఎంపీడీఓ బీవీఎల్ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసే, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూకు సంబంధిత సమస్యలను తహసీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమంలో అర్జీలు అందించాలని తహసీల్దారు పి.జాహ్నవిరెడ్డి ఒక ప్రకటనలో చెప్పారు.

ముదునూరులో ఉచిత వైద్య శిబిరం



ఉయ్యూరు: మండలంలోని ముదునూరు పంచాయతీ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ధీర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్యులు దండమూడి కుశల్ ధీరజ్, డాక్టర్ రవళి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. బీపీ, షుగరు, చర్మవ్యాధులు సాధారణ వ్యాధులకు అవసరమైన వైద్య సేవలు అందించారు.శిబిరాన్ని సర్పంచ్ మొవ్వా వెంకట నాగలక్ష్మి ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి గంగాధర్‌రావు పర్యవేక్షించారు.

బ్రహ్మంగారి జెండా ఉత్సవాలకు ముస్తాబు

- సంప్రదాయబద్ధంగా సాగుతున్న ఉత్సవాలు
- శ్రావణమాసం రెండో శుక్రవారం జెండా ఉత్సవం
- ముస్తాబైన బ్రహ్మంగారి జయధ్వజస్తంభం

కంకిపాడు: బ్రహ్మంగారి జయ ధ్వజస్తంభం జెండా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జెండా వేడుకకు సర్వం సిద్ధమైంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాట్లను ఉత్సవ కమిటీ పర్యవేక్షిస్తోంది. జెండా ఉత్సవానికి ఈడుపుగల్లు గ్రామం ముస్తాబైంది. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన బ్రహ్మంగారి జయధ్వజ స్తంభాల్లో మూడింటిలో ఒకటి ఈడుపుగల్లులో ఉంది. ఏలూరు, జగ్గయ్యపేటలో రెండు ధ్వజస్తంభాలు ఉన్నాయి. వీటిలో ఈడుపుగల్లు ధ్వజస్తంభమే పెద్దది. గ్రామం సిరిసంపదలతో తులతూగాలని, ప్రజల ఆరోగ్యం వృద్ధి చెందాలని కాంక్షిస్తూ ఏటా గ్రామంలో బ్రహ్మంగారి జెండా ఉత్సవాన్ని నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఏటా శ్రావణమాసం రెండో శుక్రవారం సంప్రదాయబద్ధంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.



ధ్వజస్తంభం చుట్టూ కర్రలతో ఏర్పాటు చేసిన అడితి

ధ్వజస్తంభం చరిత్ర ఇదీ.....

ఈడుపుగల్లు గ్రామంలో 1835వ సంవత్సరంలో శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్వజస్తంభాన్ని బ్రహ్మశ్రీ లంకెపల్లి రామబ్రహ్మయోగీంద్రులచే స్థాపించబడింది. 1925 మే 15న సంభవించిన తుపానుతో ధ్వజస్తంభం శిథిలం కావటంతో 1935లో వల్లభాపురపు వీరాచార్యులు, పర్వతనేని చినకామయ్య చౌదరి, మేడూరి వెంకటాచార్యులు, గ్రామస్తుల సహకారంతో పునఃప్రతిష్ఠ చేశారు. ధ్వజస్తంభం స్థాపించిన తొలినాళ్లలో మూడేళ్లకో పర్యాయం జెండా ఉత్సవం జరిగేది. ఉత్సవాన్ని జరిపించిన భక్తుల కోర్కెలు నెరవేరటంతో జెండా ఉత్సవాన్ని జరిపించేందుకు భక్తులు ముందుకు రావటం అధికమైంది. దీంతో ప్రతి సంవత్సరం శ్రావణమాసం రెండో శుక్రవారం జెండా ఉత్సవాన్ని జరిపించటం సంప్రదాయంగా సాగుతోంది.

ఈనెల 25న జెండా ఉత్సవం...

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఈనెల 25న బ్రహ్మంగారి జెండా ఉత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బిల్డర్ బొబ్బా గోపాలకృష్ణ, కృష్ణప్రియ దంపతులు ఉత్సవాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. దీంతో ధ్వజస్తంభం చుట్టూ కర్రలతో అడితి కట్టి, నూతన రంగులతో ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు.

అప్రమత్తతతో సైబర్ నేరాల నుంచి రక్షణ

కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పవన్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.ఐ పవన్‌కుమార్ అన్నారు. గాంధీనగర్‌లోని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఆదివారం ' సైబర్ నేరాలు -తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ సైబర్ స్పేస్ పరిధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డిజిటల్ క్రమశిక్షణ లేకపోతే ఫోన్ హాకింగ్, డేటా చోరీ జరగడం ద్వారా వచ్చే అనర్థాలను సోదహరణంగా వివరించారు. పాస్‌వర్డ్ రక్షణ విధానం, వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ ద్వారా ఫొటోస్, వాయిస్ కాల్స్ షేరింగ్‌తో వచ్చే ఇబ్బందులను, ఇటీవల వెలుగు చూసిన ఘటనలపై అవగాహన కల్పించారు. సభ్యులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం పవన్‌కుమార్‌ను చాంబర్ ప్రతినిధులు సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు అధ్యక్షతన కార్యక్రమంలో చాంబర్ సంయుక్త కార్యదర్శి ఈమని దామోదర్, ప్రథమ ఉపాధ్యక్షులు పొన్నూరు రామకుమార్, మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్, విజయవాడ చాంబర్ పక్షపత్రిక ఎడిటర్ డాక్టర్ ఎంసీ దాస్ పాల్గొన్నారు.

హోమియో, ఆయుర్వేదంతో అన్ని వ్యాధులు నయం చేయొచ్చు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హోమియో, ఆయుర్వేదంతో అన్ని వ్యాధులను నయం చేయవచ్చని ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్యులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఆరోగ్య అవగాహన ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఆరోగ్యంగా ఉండటానికి వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సుమారు 200 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమాలను ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ పర్యవేక్షించారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కార్తికేయుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కళకళలాడింది. శ్రావణ మాసం, సెలవుదినం ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎటుచూసినా భక్తులతో నిండిపోయింది. క్యూలైన్లు అన్నీ భక్తులతో బారులు తీరాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.




మోపిదేవిలో నాగపుట్టలో పాలు పోస్తున్న భక్తులు

వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయదుందుభి

గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో శనివారం జరిగిన గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయ దుందుభి మోగించారు. మెజార్టీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. దీంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

– గన్నవరం/పెనమలూరు



మలబండి దుర్గాప్రసాద్, కంకిపాడు 9వ వార్డు



ధనకొండ అంజలి, ముస్తాబాద 1వ వార్డు (ఏకగ్రీవం)



కూచిపూడి జ్ఞానసుందరం, కొంద పావులూరు 6వ వార్డు (ఏకగ్రీవం)



కటికల సుబ్బారావు, చిన్నఅవుటపల్లి 6వ వార్డు (ఏకగ్రీవం)



బండి నాగేశ్వరమ్మ, తుట్టగుంట 5వ వార్డు (ఏకగ్రీవం)



పంచకర్ల సునీత, ఏ.సీతారామపురం 6వ వార్డు (ఏకగ్రీవం)



కగ్గా అంతర్వేదమ్మ, ఓగిరాల 2వ వార్డు (ఏకగ్రీవం)



లంకా గణపతిరావు, అంపారం 7వ వార్డు (ఏకగ్రీవం)



మోర్ల శివమ్మ, వీరవల్లి 11వ వార్డు (ఏకగ్రీవం)



పంతం ప్రకాశం, మల్లవల్లి 6వ వార్డు



వింత శ్రీనివాసరెడ్డి, తేలప్రోలు 4వ వార్డు



కొడాలి మేరిమ్మ, తెన్నేరు 7వ వార్డు



బొట్ల సుధారాణి, ప్రొద్దుటూరు 4వ వార్డు (ఏకగ్రీవం)



గణపతి సేవలో మర్కటాలు

గణపతి సేవలో మర్కటాలు. అవును నిజమే.. న్యూ రాజరాజేశ్వరిపేటలోని రావిచెట్టు కింద వినాయకుడి విగ్రహం ఉంది. ఆ చెట్టు వద్దకు వచ్చిన మర్కటాలు అక్కడ ఉన్న వినాయకుడి విగ్రహం వద్ద ఉన్న చెట్ల ఆకులు, ఇతర వ్యర్థాలను తొలగించే దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి' క్లిక్‌మనిపించింది. వినాయకుడి మీద భక్తితో విగ్రహం చుట్టూ శుభ్రం చేస్తున్న వానరాలను.. స్థానికులు ఔరా అంటూ చూశారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో అవార్డు



గన్నవరం: మండలంలోని దావాజిగూడెం గ్రామానికి చెందిన సాయికుమార్‌కు జాతీయ స్థాయి ఫొటోగ్రఫీలో అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రాఫర్స్ అకాడమీ జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో సాయికుమార్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ నెల 19న గుణదల రోటరీ ఆడిటోరియంలో రాష్ట్ర కో ఆపరేటివ్ అండ్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర 6వ బెటాలియన్ కమాండెంట్ కేవీఎస్‌వీ.సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రాఫర్స్ అకాడమీ నిర్వాహకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరంరూరల్: మండలంలోని కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ గుణదల ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో గన్నవరం సెక్షన్ పరిధిలో కొత్త లైన్ ఎరెక్షన్ వర్క్ నిమిత్తం పురుషోత్తపట్నం ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. గృహ, వ్యవసాయ, వ్యాపార, పరిశ్రమల వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మద్యం షాపుల్లో తెలుగుతమ్ముళ్ల చిందులు



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని జవహర్ ఆటోనగర్ పంటకాలువ రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన లోకేష్ పాదయాత్రకు వచ్చిన తెలుగు తమ్ముళ్లు బార్ అండ్ రెస్టారెంట్ల ముందు చిందులు వేశారు. ఆటోనగర్ పంటకాలువ రోడ్డులోని బార్ అండ్ రెస్టారెంట్‌లు తెలుగు తమ్ముళ్లతో కిక్కిరిశాయి. డబ్బులు ఇచ్చే విషయంలో పలువురు కార్యకర్తలు ఘర్షణకు దిగారు. రెస్టారెంట్‌లో ఉన్న సిబ్బంది వారిని బయటకు పంపించడంతో గొడవ సద్దుమణిగింది. కార్యకర్తలు మద్యం షాపులకు అతుక్కుపోవడంతో పాదయాత్రలో జనం కరువయ్యారు.

సాగరతీరంలో మెరైన్ గస్తీ

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ముమ్మర గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు పెద్ద సంఖ్యలో సాగర తీరానికి తరలివచ్చారు. పర్యాటకులు సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. యువకులు బీచ్‌లో పలు విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. మెరైన్ పోలీసులు పర్యాటకులకు సముద్ర స్థితిగతులపై అవగాహన కల్పించారు. పర్యాటకులు సముద్రంలో లోపలికి వెళ్లకుండా లౌడ్‌స్పీకర్ల ద్వారా అప్రమత్తం చేశారు. మెరైన్ సీఐ పవన్‌కిషోర్ పర్యవేక్షణలో ఎస్ఐ జిలాని, సిబ్బంది గస్తీలో పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి



శ్రావణ మాసం పురస్కరించుకుని ఆదివారం ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి కనిపించింది. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమ పూజలను విశేషంగా చేయించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో మెట్ల పూజలను చేశారు. ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలుగా మారాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేటితో ముగియనున్న ఓటర్ల సర్వే

విజయవాడరూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల రోజులుగా జరుగుతున్న ఓటర్ల సమగ్ర సర్వే కార్యక్రమం సోమవారంతో ముగుస్తుందని గన్నవరం నియోజకవర్గం డెప్యూటీ తహసీల్దార్(ఎన్నికలు) గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో విజయవాడ రూరల్ మండలంలో మొత్తం 40,230 గృహాలుండగా వాటిలో 15,190 గృహాలను(19వ తేదీ నాటికి) బూత్‌స్థాయి అధికారులు ఇంటింటా సర్వే నిర్వహించారన్నారు. కొత్త ఓటర్లుగా నమోదు చేయించుకోదల్చిన వారు తమ ఓటును బూత్ స్థాయి అధికారుల వద్ద లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. పేరులో తప్పులు ఉంటే ఫామ్ 8 అందజేయాలన్నారు.

మైనార్టీలపై లోకేష్ మొసలి కన్నీరు

వించిపేట(విజయవాడపశ్చిమ): మైనార్టీల సంక్షేమంపై టీడీపీ నేత లోకేష్ సవతితల్లి ప్రేమ ప్రదర్శిస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నాడని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ విమర్శించారు. ఆదివారం వించిపేట, నైజాంగేటు సెంటర్‌లోని తన కార్యాలయంలో మైనార్టీ నేతలతో కలసి విలేకరులతో మాట్లాడారు. నగరంలో యువగళం పాదయాత్ర సందర్భంలో కొంత మంది ముస్లింలతో లోకేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లింలకు అన్యాయం జరుగుతోందని, వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, తాను ముస్లింలను ఉద్ధరిస్తానంటూ మొసలి కన్నీరు కారుస్తూ కపట నాటకాలు ఆడుతున్నాడని ఎద్దేవా చేశారు. రోడ్ల విస్తరణ పేరుతో మసీదులు, దర్గాలు, జెండా చెట్టులను కూల్చడం, టీడీపీ ప్రభుత్వంలో వేలాది వక్ఫ్ భూములు ఆక్రమణలకు గురవడానికి కారణమైన లోకేష్ నేడు మైనార్టీ ఓట్ల కోసం కపట నాటకాలు ఆడటం మానుకోవాలని హితవుపలికారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మైనారిటీలకు పెద్దపీట వేస్తూ సంక్షేమ ప్రభుత్వంగా నిరూపించుకుందని గౌస్‌మొహిద్దీన్ గుర్తుచేసారు. లోకేష్ ముస్లిం మైనార్టీలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న గౌస్‌మొహిద్దీన్

ఆరోగ్య హక్కుపై రౌండ్‌టేబుల్ సమావేశం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆరోగ్య హక్కు చట్టం ద్వారానే అందరికీ ఆరోగ్యం సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.వి.సాయిప్రసాద్ అధ్యక్షతన ఆదివారం ఏపీలో ఆరోగ్య హక్కు చట్టాన్ని తేవాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ పి.వి.రమేష్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్యం అందాలంటే ఆరోగ్య బడ్జెట్ ముఖ్యమన్నారు. సమావేశంలో ప్రజా ఆరోగ్య వేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్ ప్రకాష్, వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, మెడికల్ రెప్రజెంటేటివ్ యూనియన్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్, ఉపాధ్యాయ, విద్యార్థి , మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భగవద్గీత తరగతులు ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం భగవద్గీత తరగతులు ప్రారంభమయ్యాయి. సరస్వతీ సామ్రాజ్యం ఆధ్వర్యాన నిర్వాహకురాలు సునీత విద్యార్థులకు భగవద్గీత తరగతులు ప్రారంభించారు. మొదటి అధ్యాయం ప్రారంభించి అందులోని శ్లోకాలను విద్యార్థులకు వివరించారు. వారితో శ్లోకాలు పలికించి, సాధన చేయించారు. వాటి తాత్పర్యాలను వివరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ భగవద్గీత మానవాళికి శ్రీకృష్ణుడు ప్రసాదించిన గొప్ప మార్గదర్శక గ్రంథమని పేర్కొన్నారు.భగవద్గీత అనేది మతానికి సంబంధించినది కాదని, అది సర్వమానవ సమాజానికి దిక్సూచి లాంటిదన్నారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, వై.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పిస్తున్న సరస్వతి సామ్రాజ్యం, నిర్వాహకులు సునీత

యువతలో ప్రతిభ వెలికితీయడానికే..

కృష్ణలంక(విజయవాడతూర్పు): యువతలో ప్రతిభ వెలికితీయడానికి ఫొటో ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహించినట్లు సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, జాషువా సాంస్కృతిక వేదిక, జీఆర్‌కే అండ్ పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యాన గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మొబైల్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్, ఫొటో ఆర్ట్ కాంటెస్ట్ అలరించి ఆలోచింపచేసింది. ఎగ్జిబిషన్‌లో 20 మంది యువ ఫొటోగ్రాఫర్స్ తీసిన 80 చిత్రాలను ప్రదర్శించారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కన్వీనర్ సునీల్ కుమార్, కో కన్వీనర్ గిరిధర్ అరసవల్లి, ఈవెంట్ మేనేజర్ స్ఫూర్తి శ్రీనివాస్, కో ఆర్డినేటర్లు కళాసాగర్ యెల్లపు, ఎస్.పి.మల్లిక్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

28న దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన పాలక మండలి సమావేశం ఈ నెల 28వ తేదీ జరగనుంది. బ్రాహ్మణ వీధిలోని దేవస్థాన భవనంలోని బోర్డు మీటింగ్ హాల్‌లో చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఆ రోజు ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి దుర్గగుడి ఈవో భ్రమరాంబ, ఆలయ ఏఈవోలతో పాటు ఇంజినీరింగ్ విభాగం అధికారులు హాజరుకానున్నారు. అక్టోబర్‌లో జరిగే దసరా మహోత్సవాల ఏర్పాట్ల పనులతో పాటు ఉత్సవాల నిర్వహణపై చర్చించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై రాజమహేంద్రవరానికి చెందిన సత్య శ్రావణి నృత్యనికేతన్‌కు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.